క్లుప్తంగా

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి



కర్నూలు(సెంట్రల్): జాతీయ హరిత ట్రిబ్యునల్(ఎన్‌జీటీ) ఆదేశాల మేరకు దీపావళి రోజు గ్రీన్ క్రాకర్స్‌నే కాల్చాలని పర్యావరణ ఇంజనీరు వైటీ మునిప్రసాద్ తెలిపారు. 'ఇప్పటికే కర్నూలులో వాతావరణం కాలుష్యం పెరిగింది. దీపావళి పండుగ అంటే దీపాలు వెలిగించి సంతోషంగా జరుపుకునే పండుగ. బాణాసంచాను పేల్చడం ద్వారా పర్యావరణం దెబ్బతింటుంది. గుండె, ఊపిరితిత్తులతో బాధపడే వారికి పెద్ద పెద్ద శబ్దాలతో కూడిన క్రాకర్స్‌ను పేల్చడం ద్వారా ప్రాణాపాయం జరగవచ్చు.ఈ నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయా'లని శనివారం ఆయన ఓ ప్రకటనలో వెల్లడించారు.

భక్తి శ్రద్ధలతో కాళీమాతకు పూజలు

కర్నూలు కల్చరల్: నరక చతుర్దశిని పురస్కరించుకొని శనివారం రాత్రి ఓల్డ్‌సిటీ కుమ్మరి వీధిలోని రాంబొట్ల ఆలయంలో శ్రీ కాళీమాతకు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. వారం రోజులపాటు పూజలు నిర్వహించి ఈనెల 19వ తేదీన అమ్మవారిని నిమజ్జనం చేస్తామని నిర్వాహకులు మధు పేర్కొన్నారు.

ఆటోమేటిక్ జనరేషన్ చలానాను రద్దు చేయాలి

కర్నూలు(సెంట్రల్): ట్రాఫిక్ సిగ్నల్స్‌ను క్రాస్ చేస్తే ఆటోమేటిక్‌గా జనరేట్ అయ్యే చలానా విధానాన్ని రద్దు చేయాలని సీఐటీయూ నగర ఉపాధ్యక్షుడు రాజగోపాల్ డిమాండ్ చేశారు. శనివారం సుర్జీత్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

రోగులకు పండ్లు పంపిణీ

కర్నూలు(హాస్పిటల్): బ్రహ్మర్షి సుభాష్ పత్రీజీ 76వ జయంతిని పురస్కరించుకుని శ్రీశ్రీ సదానంద యూనివర్సల్ వన్‌నెస్ స్పిరిచువల్ సర్వీస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని మానసిక, కుష్టు వ్యాధిగ్రస్తుల వార్డులోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ట్రస్ట్ అధ్యక్షుడు బైజుబాబు మాట్లాడుతూ తాము అభాగ్యులు, అనాథలు, వృద్ధులు, నిరాశ్రయుల కోసం పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కిశోర్, హరూన్ ముస్తాకు, నందకిశోర్, చంద్ర, సూరి, దాదా పీర్, బోయ వెంకటేష్, రహమతుల్లా, రవీంద్రారెడ్డి, రవిగౌడ్ పాల్గొన్నారు.

14న నర్సులకు షుగర్ వ్యాధిపై అవగాహన

కర్నూలు(హాస్పిటల్): అంతర్జాతీయ డయాబెటీస్ డే సందర్భంగా ఈ నెల 14వ తేదీన నర్సులకు షుగర్‌పై అవగాహన కల్పించనున్నట్లు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఎండోక్రైనాలజి హెచ్‌ఓడీ డాక్టర్ పి. శ్రీనివాసులు చెప్పారు. శనివారం ఎండోక్రైనాలజి విభాగంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చాలా మంది షుగర్ రోగులకు ఇన్సులిన్ ఇంజెక్షన్ వేసుకోవడంపై అవగాహన లేదన్నారు. ఎక్కడ పడితే అక్కడ, ఎలా పడితే అలా వేసుకోవడం వల్ల పుండ్లు అవుతున్నాయని తెలిపారు. ఈ కారణంగా ఈ నెల 14వ తేదీన జీఎన్‌ఎం, బిఎస్సీ నర్సులు, ఏఎన్‌ఎంలకు తమ విభాగం ఆధ్వర్యంలో ఇన్సులిన్ వేసుకోవడంపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ప్రొఫెసర్ డాక్టర్ రాధారాణి పాల్గొన్నారు.

డోర్ డెలివరీ పక్కాగా చేయాలి

కర్నూలు(రాజ్‌విహార్):కార్గో సేవలను విస్తృతం చేసేందుకు తీసుకొచ్చిన డోర్ డెలివరీ కవర్లు, పార్శిళ్లను పక్కాగా అందించాలని రోడ్డు రవాణా సంస్థ కర్నూలు-1డిపో మేనేజరు సుధారాణి సూచించారు. పార్శిల్స్ డెలివరీపై శనివారం ఆమె సిబ్బందికి తగిన సూచనలు ఇచ్చారు.

33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి

కర్నూలు(సెంట్రల్): చట్ట సభల్లో మహిళలకు తక్షణమే 33 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని ఏపీ మహిళా సమైఖ్య రాష్ట్ర కార్యదర్శి పి.దుర్గా భవాని డిమాండ్ చేశారు. శనివారం సీఆర్ భవన్‌లో జిల్లా అధ్యక్షురాలు గిడ్డమ్మ అధ్యక్షత 19వ జిల్లా మహాసభలు ప్రారంభమయ్యాయి. పి.దుర్గాభవాని ముఖ్య అతిథిగా హాజరై ముందుగా సమైఖ్య జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, మహిళా సమైఖ్య జిల్లా నాయకురాలు లలితమ్మ, నాయకురాళ్లు శ్రావణిరెడ్డి, అమీనాబీ, వరలక్ష్మి, ఈరమ్మ, వాణి,జయమ్మ పాల్గొన్నారు.

డాక్టర్ విజయభాస్కర్ మృతి

కర్నూలు(హాస్పిటల్): ప్రముఖ ఊపిరితిత్తుల వ్యాధుల నిపుణులు డాక్టర్ ఎం. విజయభాస్కర్ (68) శుక్రవారం రాత్రి గుండెపోటుతో మరణించారు. స్థానిక చాణిక్యపురి కాలనీలో నివాసం ఉంటున్న ఆయనకు గత రాత్రి తీవ్రమైన గుండెపోటు వచ్చి ఇంట్లోనే కన్నుమూశారు. ఆయన 1974లో ఎంబీబీఎస్‌ను కర్నూలు మెడికల్ కాలేజీలో చదివారు. అనంతరం తిరుపతిలో పల్మనాలజీ పీజీ పూర్తి చేశారు. అసిస్టెంట్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్, హెచ్‌ఓడీగా కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని పల్మనాలజి విభాగంలో పనిచేసి 2013లో పదవీ విరమణ పొందారు. ఆయన మృతి పట్ల నగర వైద్యులు సంతాపం తెలిపారు.

అబుల్ కలాం ఆజాద్ సేవలు ఎనలేనివి

- నగరంలో ఘనంగా తొలి విద్యా శాఖ మంత్రి జయంతి వేడుకలు
- వైఎస్‌ఆర్‌సీపీ కార్యాలయంలో నివాళులర్పించిన మేయర్ రామయ్య





అబుల్ కలాం ఆజాద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మేయర్ బీవై రామయ్య, గిప్సన్ కాలనీలో ఎస్వీ మోహన్‌రెడ్డి, విజయ మనోహరి నివాళి దృశ్యం

కర్నూలు(రాజ్‌విహార్): దేశ తొలి విద్యా శాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ విద్యాభివృద్ధి, మైనారిటీల సంక్షేమానికి చేసిన కృషి ఎనలేనిదని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు, మేయర్ బీవై రామయ్య అన్నారు. మౌలానా ఆజాద్ జయంతిని పురస్కరించుకుని జాతీయ విద్యా, మైనారిటీ దినోత్సవ కార్యక్రమం స్థానిక బిర్లాగేట్ వద్ద ఉన్న పార్టీ జిల్లా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆజాద్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా శాఖ మంత్రిగా ఆజాద్ అనేక సంస్కరణలు తీసుకొచ్చి విద్యాభివృద్ధికి పాటుపడ్డారని చెప్పారు. ఆయన ఆశయ సాధనకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని, ఇందులో భాగంగా పేదలకు కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య అందించేందుకు శ్రీకారం చుట్టారన్నారు. గతంలో అగ్రవర్ణాలకు పరిమితమైన చదువు ఇప్పుడు సామాన్యులకూ అందుతోందని పేర్కొన్నారు. చంద్రబాబు ప్రభుత్వం కార్పొరేట్ విద్యా సంస్థలకు కొమ్ము కాస్తే.. నేడు సీఎం జగన్ ప్రభుత్వ పాఠశాలలను సైతం కార్పొరేట్ తరహాలో రూపుదిద్దుతుందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్ చంద్రబోస్, పార్టీ నాయకులు మద్దయ్య, ధనుంజయ ఆచారి, కార్పొరేటర్ శ్వేతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ఆజాద్ ఎంతో కృషి

తొలి విద్యాశాఖ మంత్రిగా ఉండి దేశంలో విద్యాప్రమాణాలు పెంచేందుకు మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఎంతో కృషి చేశారని కేడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ ఎస్వీ విజయ మనోహరి అన్నారు. జాతీయ విద్య, మైనార్టీ దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక గిప్సన్ కాలనీలోని తన కార్యాలయంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉన్నత విద్యావంతుడైన మౌలానా దేశంలో సామాన్యులకు నాణ్యమైన విద్య అందేలా చేశారన్నారు. అనంతరం ఎస్వీ మోహన్ రెడ్డి మాట్లాడుతూ పాకిస్తాన్ విభజన సమయంలో ఆ దేశ ప్రధానమంత్రి వద్దని, భారతీయుడిగానే ఉండిపోయిన వ్యక్తి మౌలానా ఆజాద్ అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫోమా ఆధ్వర్యంలో....

మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు ఫెడరేషన్ ఆఫ్ ముస్లిం అసోసియేషన్ (ఫోమా) ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. స్థానిక బండిమెట్ట కార్యాలయంలో మౌలానా చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షుడు ఎం.ఎ.హమీద్, ఉపాధ్యక్షుడు అబ్దుల్ వాహిద్, ప్రధాన కార్యదర్శి అబ్దుల్ అజీజ్ ఖాన్ పాల్గొన్నారు.

కర్నూలు(సెంట్రల్) : భారతరత్న డాక్టర్ మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలు ఎనలేనివని, ఆయన దేశంలో విద్యాభివృద్ధికి బాటలు వేసిన మహోన్నత వ్యక్తి అని కర్నూలు నగర కాంగ్రెస్ అధ్యక్షుడు జాన్ విల్సన్ అన్నారు. శనివారం ఆజాద్ 135వ జయంతిని పురస్కరించుకుని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు దామోదరం రాధాకృష్ణ, బజారన్న, ఖాజా హుస్సేన్ పాల్గొన్నారు.

జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై సర్వే

కర్నూలు(హాస్పిటల్): జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలులో భాగంగా ప్రజలకు అందుతున్న సేవల గురించి శనివారం కర్నూలులోని వడ్డేగేరిలో కేంద్ర బృందం సర్వే నిర్వహించింది. ఈ బృందంలో సభ్యులు రాజేశ్వరి, సరోజిని, వరలక్ష్మి, వసుంధర, శ్రీను ఉన్నారు. వారు వడ్డేగేరిలోని ఎంపిక చేసిన 23 కుటుంబాలను ఈ కేంద్ర బృందం సర్వే నిర్వహించింది. ఆరోగ్య సేవలు ప్రజలకు ఏ మాత్రం అందుతున్నాయి, ప్రజల ఆర్థిక అంశాలు, ఆరోగ్యసేవలు తదితర అంశాల గురించి బృందం ప్రశ్నించి వివరాలు సేకరించింది. ఈ సమాచారం ఆధారంగా ఆరోగ్య సేవలను మరింత పటిష్టంగా అమలు చేసేందుకు ప్రణాళికలు రూపొందించనున్నట్లు సర్వే బృందం పేర్కొంది. వారి వెంట వైద్య ఆరోగ్యశాఖ ఎస్‌ఓ హేమసుందరం, ఎంపీహెచ్‌ఈఓ నరసప్ప, వేణుగోపాల్, ఏఎన్‌ఎంలు, ఆశాలు ఉన్నారు.

డిసెంబర్ 18న ఏపీ రైతు సంఘం మహాసభలు

కర్నూలు(సెంట్రల్) : ఏపీ రైతు సంఘం జిల్లా మహాసభలను డిసెంబర్ 18వ తేదీన నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.లక్ష్మీరెడ్డి, కె.జగన్నాథం శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 25 వేల సభ్యత్వాలే లక్ష్యంగా పని చేస్తున్నామని చెప్పారు.

దొంగల ముఠా అరెస్టు



దొంగల ముఠాల నుంచి రికవరీ చేసిన వాహనాలు, వైర్లు, నగలు, నగదు వివరాలను వెల్లడిస్తున్న సీఐ

కర్నూలు : జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో గొర్రెలు, కరెంటు తీగలు, ఇళ్లలో దొంగతనాలకు పాల్పడిన దొంగల ముఠాలను తాలూకా పోలీసులు అరెస్టు చేసి కటకటాలకు పంపారు. పక్కా సమాచారం మేరకు గుంతకల్లుకు చెందిన రాఘవయ్య, కర్నూలు మమతా నగర్‌కు చెందిన ఎరుకలి సురేష్, డోన్ మండలం కొత్తబురుజు గ్రామానికి చెందిన రంగనాయకులు, కర్నూలు ప్రకాష్‌నగర్‌కు చెందిన బోయ విజయ్, నరసింహారెడ్డి నగర్‌కు చెందిన ఎరుకలి మధు, అశోక్ నగర్‌కు చెందిన పేరపోగు రాకేష్, దేవనకొండకు చెందిన ఎరుకలి సురేష్, సుధాకర్, డాన్ శ్రీను, కడప రామయ్య తదితరులను అదుపులోకి తీసుకుని విచారించగా వారి నేరాల చిట్టా బయటపడింది. కర్నూలు మండలం రుద్రవరం గ్రామ పొలిమేరలోని కొండ వద్ద గొర్రెల దొంగతనం, అలాగే కర్నూలు బాలాజీ నగర్, వెంగన్నబావి సమీపంలోని బాలాజీ విల్లాస్‌లోని ఓ ఇంట్లో దొంగతనాలకు పాల్పడినట్లు అంగీకరించారు. అలాగే జి.శింగవరం గ్రామంలో మోటర్ సైకిల్, నిడ్జూరు, ఉలిందకొండ, సూదేపల్లి, బ్రాహ్మణదొడ్డి, సంగాల, కడప జిల్లా ముద్దనూరు మండలం చెన్నంపల్లి గ్రామాల్లో మొత్తం 111 గొర్రెలు దొంగతనం చేసినట్లు అంగీకరించారు. వారి నుంచి రూ.21 లక్షలు విలువ చేసే గొర్రెలు, మోటర్ సైకిళ్లు, బంగారు, వెండి ఆభరణాలు, బొలెరో వాహనాన్ని స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు సీఐ శ్రీరాం తెలిపారు. అలాగే కర్నూలు మండలం బి.తాండ్రపాడు గ్రామం వద్ద ఎన్‌హెచ్-44 నుంచి నంద్యాలకు వెళ్లే హైవే రింగ్ రోడ్డు మధ్యలో గల టిడ్కో ఇళ్లల్లో కరెంటు వైర్లు దొంగతనం చేసిన మరో 16 మంది ముఠా సభ్యులు నంద్యాల జిల్లాకు చెందిన పసుపుల శ్రీకాంత్, నరసింహుడు, బోయ శ్రీనివాసులు, మధుబాబు, బాలకొండయ్య, పసుపుల నాగేంద్ర, పుల్లయ్య, ఎర్ర పాపన్న, పోలూరు మల్లికార్జున, షేక్ ఫరూక్ బాషా, నాగశేషులు, ప్రసన్న కుమార్, చింతమాను నాగరాజు, బోయ పెద్ద ఎల్లయ్య, వడ్డె మదనగోపాల్, షేక్ బాబా హుసేన్ తదితరులను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించారు. వారి నుంచి రూ.19,61,517 విలువ చేసే 315 కరెంటు వైర్ బండిల్స్, నేరానికి ఉపయోగించిన తుఫాన్ వాహనం, రెండు మోటర్‌సైకిళ్లను సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు. రెండు ముఠాల నుంచి రూ.61,61,517 విలువ చేసే సొమ్ములు, వాహనాలు, గొర్రెలను రికవరీ చేసినట్లు సీఐ శ్రీరాం తెలిపారు.

సున్నపురాయి తరలిస్తున్న లారీ సీజ్

కర్నూలు (న్యూటౌన్): డోన్ మండలం యు.కొత్తపల్లె వద్ద అక్రమంగా సున్నపురాయి తరలిస్తున్న లారీని సీజ్ చేసినట్లు మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. శనివారం తెల్లవారుజామున విశ్వసనీయ సమాచారం మేరకు ఆకస్మికంగా దాడి చేసి లారీని పట్టుకున్నామన్నారు. మైనింగ్ డీడీ మాట్లాడుతూ డోన్‌కు చెందిన గౌసియా ట్రాన్స్‌పోర్టుకు చెందిన లారీ అక్రమంగా సున్నపురాయి తరలిస్తున్నట్లు విచారణలో తేలడంతో తదుపరి చర్యల నిమిత్తం జలదుర్గం పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు వివరించారు. అక్రమంగా ఎవరైనా డోలమైట్, సున్నపురాయి, వైట్‌షీల్, స్టెయిడెడ్ పొడర్ తరలిస్తే చట్టపరంగా కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు. తనిఖీల్లో రాయల్టీ ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్ పోటీలు ప్రారంభం



కర్నూలు (టౌన్) : స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలోని వ్యాయామ శాలలో శనివారం జిల్లా స్థాయి వెయిట్ లిఫ్టింగ్ సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో వెయిట్ లిఫ్టింగ్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను వెయిట్‌లిఫ్టింగ్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి శివరాం గౌడ్ ప్రారంభించి మాట్లాడారు. వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో మంచి అవకాశాలు ఉన్నాయని, జిల్లా స్థాయిలో ఎంపికయిన క్రీడాకారులు ఈనెల 16 నుండి 18 వతేదీ వరకు శ్రీకాకుళం పట్టణంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పాపా, సభ్యులు నాగరాజు, కోచ్ బాషా, జలీల్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులు, ఆయాలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

కర్నూలు(సెంట్రల్): ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు, ఆయాలకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జె.నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం కార్మిక, కర్షక భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..కొంతమంది మధ్యాహ్న భోజన కార్మికులు 20 ఏళ్లుగా పనిచేస్తున్నారన్నారు. వారికి కనీస వేతనాలు ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. అలాగే పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాలకు కూడా ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతనం రూ.26 వేలు, పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయాలు కల్పించాలని కోరారు.

టపాసులు సరసమైన ధరకు విక్రయించాలి



టపాసుల దుకాణాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు : టపాసులను సరసమైన ధరకు విక్రయించాలని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శనివారం కల్లూరు అర్బన్ కల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో బాణసంచా (టపాసుల) 8 దుకాణాలను ఏర్పాటు చేశారు. దుకాణలను రిబ్బన్ కట్ చేసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముందుగా ప్రజలందరి దిపావళి శుభాకాంక్షలు తెలిపారు. అందరి ఇళ్లలో చీకట్లు తొలగి వెలుగులు నిండాలని ఆకాంక్షించారు. కల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన దుకాణలను అయా చుట్టు పక్కల ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సుదర్శన్‌రెడ్డి, శ్రీనివాసులు, అరుణ, నాయకులు వీరయ్య, శ్రీనివాసులు యాదవ్, బాలచంద్రారెడ్డి పాల్గొన్నారు.

సర్దార్‌బాషా సేవలు మరువలేని

కర్నూలు(సెంట్రల్) : స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్(ఎస్‌డబ్ల్యూఎఫ్)కు సర్దార్ బాషా చేసిన సేవలు ఎనలేనివని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు అన్నారు. శనివారం కార్మిక, కర్షక భవన్‌లో సర్దార్ బాషా సంస్మరణ సభ నిర్వహించారు. ముందుగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించి ఆయన సేవలను నెమరు వేసుకున్నారు. కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ రీజినల్ కార్యదర్శి వీఎస్ రాముడు, సుధాకర్, అజార్‌బాషా, శేఖర్, మద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కర్నూలు (సిటీ) : మండల పరిధిలోని ఎల్.పేట-ఉల్చాల మధ్యలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రేమట గ్రామానికి చెందిన మేకల లక్ష్మన్న (60) కోలుకోలేక శనివారం కర్నూలు పెద్దాసుపత్రిలో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ ఆసుపత్రికి వెళ్లి మృతదేహాన్ని చూసి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట రేమట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు సంపత్ కుమార్, తిరుమల్ రెడ్డి ఉన్నారు. కాగా మృతుడికి భార్య శకుంతలమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు.

కేసీలో శివ భక్తుడు గల్లంతు

కర్నూలు : జొహరాపురం గ్రామానికి చెందిన రామకృష్ణ (40) కేసీ కెనాల్‌లో పడి గల్లంతయ్యాడు. ఈయన పెయింటర్ పని చేస్తూ జీవనం సాగించేవాడు. ఇటీవల శివ మాల ధరించాడు. అయ్యప్ప స్వామి గుడి వెనుక శనివారం తెల్లవారుజామున స్నానానికి వెళ్లి మెట్లపై అదుపు తప్పి నీళ్లలో పడి గల్లంతయ్యాడు. ఆచూకీ కోసం స్థానికులతో పాటు కుటుంబ సభ్యులు కూడా దాదాపు కిలోమీటర్ పొడవునా గాలించినప్పటికీ ఆచూకీ లభించలేదని తెలిసింది.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



బాధిత కుటుంబాలకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సుధాకర్

కర్నూలు (సిటీ) : నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన ఆర్థిక సహాయాన్ని శనివారం ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ తన నివాసంలో అందజేశారు. కర్నూలు అర్బన్ 39వ వార్డు పరిధిలోని బాలాజీ నగర్‌కు చెందిన కారె సుగుణమ్మకు రూ.1.20 లక్షలు, సి.బెళగల్ గ్రామానికి చెందిన కె.సరోజమ్మకు రూ.1.30 లక్షల ఆర్థిక సహాయాన్ని చెక్కుల రూపంలో అందజేశారు. ఈ నేపథ్యంలో బాధిత కుటుంబాలు సీఎంకు, ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.